క్లుప్తంగా

మాజీ ఉప సర్పంచ్ మృతి

కడ్తాల్: మండల పరిధి సాలార్‌పూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ కేతావత్ బీచ్యానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి శుక్రవారం.. బీచ్యానాయక్ పార్థీవదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సభవట్ బీచ్యానాయక్, నాయకులు శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ



మెడికల్ కిట్లు అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సమకూర్చిన మెడికల్ కిట్లను శుక్రవారం గర్భిణులకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, రాజు, కృష్ణయ్య, శరత్‌చంద్ర, అనిల్, రాజు, మల్లేశ్‌గౌడ్, విజేందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని వారు దరఖాస్తు చేసుకోండి

మంచాల: మంచాల పీఏసీఎస్ బ్యాంకులో రుణమాఫీ వర్తించని రైతులు.. వారం రోజుల వ్యవధిలో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఏసీఎస్‌లో చాలా మంది రైతుల వివరాలు తప్పుగా నమోదు కావడంతో మాఫీ కాలేదని పేర్కొన్నారు. లబ్ధి పొందని వారు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్లు, పట్టా పాసుపుస్తకాల జిరాక్స్‌లు అందించాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణకు సూపర్‌వైజర్లు

ఇన్‌చార్జి ఎంపీడీఓ జంగయ్యగౌడ్



ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణకు మండలంలో తొమ్మిది మంది సూపర్‌వైజర్లను నియమించామని ఇబ్రహీంపట్నం మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వీరిని నియమించామన్నారు. మండలానికి మంజూరైన 437 ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

గ్రామాలవారీగా..

మండల వ్యవసాయ అధికారి విద్యాధరిని, ఏఈ(గ్రిడ్) రూప కప్పపహాడ్. మండల ఏఈ(పీఆర్) ఉస్మాన్ చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ, పోచారం. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ ఎలిమినేడు, ఉప్పరిగూడ. ఏఈఈ(ఆర్‌డబ్ల్యూఎస్) రజిత తుర్కగూడ, తులేకలాన్. ఎంపీఓ రఘు పోల్కంపల్లి, నెర్రపల్లి. ఏఈఓ సృజన ముకునూర్, నెర్రపల్లి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పల్లవి దండుమైలారం. మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ వెంకటకృష్ణను రాయపోల్ గ్రామానికి నియమించామని వెల్లడించారు. ఈ అధికారులు ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తూ, పరిశీలిస్తారని ఆయన పేర్కొన్నారు.

మృతురాలి నేత్రాలు దానం



ఆమనగల్లు: గుండెపోటుతో మృతిచెందిన వివాహిత మాధవి కళ్లను ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రికి దానం చేశారు. హైదరాబాద్‌లోని మారుతీనగర్‌కు చెందిన ఆమె గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు అర్థం మనోహర్, పీఆర్‌ఓ పాషా తదితరులు మాధవి భర్త అశోక్‌తో పాటు విదేశాల్లో ఉన్న ఆమె కుమారులను ఫోన్‌లో సంప్రదించారు. నేత్రదానం చేయాలని కోరడంతో కుటుంబ సభ్యులు ఇందుకు అంగీకరించారు. దీంతో ఎల్‌వీప్రసాద్ ఆస్పత్రి వైద్యులు మాధవి కళ్లను సేకరించారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించరూ!

నందిగామ: మండల పరిధిలోని మామిడిపల్లి అనుబంధ గ్రామం నసురుల్లాబాద్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయం ఆసన్నమైనందున అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించడంతో పాటు, మరుగుదొడ్లు మరమ్మతు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విస్తరణ లేదు.. వంతెన రాదు!

- అభివృద్ధికి నోచుకోని కూడలి
- ఇరుకు రోడ్డుతో వాహనదారుల ఇబ్బంది
- మూడు వరుసలతో హైవే నిర్మాణం పూర్తి
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో నిలిచిన పనులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా విజయవాడ జాతీయ రహదారి విస్తరణ చేపట్టాలని వచ్చిన ప్రతిపాదనలకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం.. విస్తరణకు పచ్చజెండా ఊపింది. ఏడాదిన్నర పాటుగా పనులు కొనసాగుతున్నాయి. తుది దశకు చేరుకున్నాయి. కానీ మధ్యలో ఉన్న అబ్దుల్లాపూర్‌మెట్ కూడలిని విస్మరించారు. విస్తరణ చేస్తారో? పై వంతెనలు నిర్మిస్తారో తెలియదు కానీ.. ఏళ్లు గడుస్తున్నా రహదారి విస్తరణ పనుల్లో స్పష్టత రావడం లేదు.

చౌరస్తాలో ఇక్కట్లు

ఎల్‌బీనగర్ నుంచి దండుమల్కాపూర్ వరకూ 24 కిలో మీటర్ల రోడ్డుకు ఇరువైపులా మూడు వరుసల విస్తరణ పనులకు రూ.600 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. కోవిడ్, గుత్తేదారుల సమస్యలతో నిర్మాణ పనులకు ఆటంకం కలుగుతూ.. నిర్విరామంగా కొనసాగింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. హయత్‌నగర్ చివరి నుంచి దండుమల్కాపూర్ వరకూ రోడ్డు పనులు పూర్తి అయినప్పటికీ, అబ్దుల్లాపూర్‌మెట్ కూడలిలో సుమారు రెండు కిలో మీటర్ల విస్తరణ పనులు చేపట్టలేదు. దీంతో చౌటుప్పల్ వైపు నుంచి హైదరాబాద్‌కు, నగరం నుంచి చౌటుప్పల్‌కు వెళ్లే వాహన దారులు.. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలిలో ఇబ్బంది పడుతున్నారు. ఇరుకుగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ జాం అవుతోంది.



అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి

వాహనాల రద్దీ..

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిత్యం రద్దీగా ఉండే విజయవాడ జాతీయ రహదారిపై చేపడుతున్న పనుల్లో 8 ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో పై వంతెనలు పూర్తయ్యాయి. ఎల్‌బీనగర్ నుంచి దండు మల్కాపూర్ రోడ్డు విస్తరణలో వనస్థలిపురం పనామా కూడలి వద్ద, హయత్‌నగర్‌లో కుంట్లూర్ రోడ్డు వద్ద, అబ్దుల్లాపూర్‌మెట్ కూడలిలో ఘట్‌కేసర్ రోడ్డు, అనాజ్‌పూర్ రోడ్డు వద్ద మినహా.. పెద్దఅంబర్‌పేటలో పసుమాముల రోడ్డు, కొహెడ రోడ్డు వద్ద, ఇనాంగూడ, బాటసింగారం కూడళ్ల వద్ద బ్రిడ్జిలు పూర్తి కాగా.. వాహనాల రాకపోకలకు అనుమతించారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో గండిమైసమ్మ దేవాలయం నుంచి మయూరి కాంట వరకు రెండు వైపులా నిలిచిన రోడ్డు విస్తరణ చేపడితే.. 24 కిలో మీటర్ల రహదారి విస్తరణ పూర్తవుతుందని, అప్పుడు కూడలిలో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగిపోతాయని స్థానికులు పేర్కొంటున్నారు.



వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అర్చకులు శ్రీనివాసమూర్తి, నర్సింహమూర్తి ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి, మహాగణాధిపతి, జయ విజయుల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించారు. ఉత్సవానికి జూలపల్లి గ్రామ ప్రజలు తలంబ్రాలతో తరలివచ్చారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మార్కెట్ చైర్‌పర్సన్ గీత, పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తలకొండపల్లి సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాములు, నాయకులు జైపాల్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, శ్రీను, యాదయ్య, రాజేందర్‌రెడ్డి, అజీజ్, రేణురెడ్డి, అంజయ్య, శ్రీశైలంగౌడ్, రాఘవేందర్‌గౌడ్, విష్ణు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లలను సర్కారు బడిలో చేర్పిస్తాం

మంచాల: ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పిస్తామని పలువురు ముస్లింలు ప్రకటించారు. శుక్రవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నిర్వహించిన మనఊరు– మనబడి కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ చౌరస్తాలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆరుట్ల పాఠశాలను దత్తత తీసుకొని, రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, బంగారు భవిష్యత్‌ను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆరుట్ల పాఠశాల ఎస్ఎంసీ కమిటీ సభ్యులు కంభాలపల్లి భాస్కర్, మండల మాజీ కో– ఆప్షన్ సభ్యులు ఎం.డీ. సలాం, యూసుఫ్ బాయ్, మైనార్టీ ముస్లిం నాయకులు ఖాజాబాయ్, గాలిబ్‌బాయ్, షబ్బీర్‌బాయ్, జంజీర్‌బాయ్, సద్దాం, ఖలీల్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



మనబడి కార్యక్రమంలో ముస్లింలు

సొంతింటి కల సాకారమే లక్ష్యం

- అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తా
- లబ్ధిదారులు దసరాకు గృహప్రవేశం చేయాలి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- 441 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత



యాచారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

యాచారం: నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అర్హులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానన్నారు. యాచారం మండల కేంద్రం రైతు వేదికలో శుక్రవారం 441 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలే కీలకమని, అందరూ లబ్ధిపొందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి, నియోజకవర్గానికి అదనంగా మొదటి దఫాలో 20 వేల ఇళ్లు వచ్చేలా చూస్తానని తెలిపారు. ఇళ్ల కేటాయింపులో రాజకీయ ప్రభావం ఉండరాదని, కులమత వివక్ష ఉండదని స్పష్టంచేశారు. మంజూరు పత్రాలు అందుకున్న వారు.. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించుకుని, దసరా రోజున గృహప్రవేశం చేసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారమే నిర్మాణం చేపట్టాలని స్పష్టంచేశారు.

పద్ధతి మార్చుకోండి

పంచాయతీ కార్యదర్శులు కొందరు ఇంకా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నట్లే భావిస్తున్నారని, ఇందిరమ్మ కమిటీలను లెక్కచేయడం లేదని ఫిర్యాదులు అందాయని తెలిపారు. అది మంచిది కాదని, వ్యవహార శైలి మార్చుకోవాలని ఆదేశించారు. మీ సమస్యలు ఏమున్నా ఉంటే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కానీ వ్యక్తిగతంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, తహసీల్దార్ అయ్యప్ప, మండల పంచాయతీ అధికారి శ్రీలత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి 10వ వార్డులో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ శంకుస్థాపన చేశారు. అంతకుముందు పలువురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్‌నాయక్, రవినాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లేశ్, బాలు, మురళీ, లక్ష్మీరెడ్డి, దావిద్, మాజీ సర్పంచ్ పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: భూమి పూజ చేస్తున్న కమిషనర్ శంకర్‌నాయక్

బీసీలకు రూ.5 లక్షలు, ఎస్సీలకు రూ.6 లక్షలు



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్ పర్సన్ తదితరులు

కడ్తాల్: పేద ప్రజల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు, బాలాజీనగర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలు అందజేశారు. ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం.. ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తుందన్నారు. మొదటి విడతలో సొంత స్థలం ఉండి, ఇల్లులేని నిరుపేద బీసీలకు రూ.5లక్షలు, ఎస్సీలకు రూ.6 లక్షలతో ఇంటి నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు రాజేశ్, షాబుద్దీన్, మల్లేశ్‌గౌడ్, ముత్తికృష్ణ, జహంగీర్‌అలీ, జహంగీర్‌బాబా, రవి, ఇమ్రాన్‌బాబా, రాంచందర్, శ్రీను, భిక్షపతి, మల్లయ్య, ఎంపీఓ లాలయ్య, కార్యదర్శి అల్లాజీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

సకాలంలో ధాన్యం కొంటున్నాం..



రైతులకు భోజనం వడ్డిస్తున్న శ్రీశైలం

ఆమనగల్లు: రైతులకు ఇబ్బంది కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గింజ సేకరిస్తామని, రైతులు దళారులకు ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. సన్నాలకు రూ.500 బోనస్ తీసుకోవాలని కోరారు. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలో చైర్‌పర్సన్ యాట గీత ఏర్పాటు చేసిన రైతులకు ఉచిత భోజన వసతి కార్యక్రమాన్ని శ్రీశైలం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, సిబ్బంది వినోద్, కిరణ్, శరత్, కాంగ్రెస్ నాయకులు సుదర్శన్, గౌస్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల మూసివేతతో విద్యార్థులకు నష్టం

తుర్కయంజాల్: రాష్ట్రంలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన పేద విద్యార్థులు నష్టపోతారని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి పి.శివ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాలు, జేఈఈ తదితర పరీక్షల్లో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలతో పోటీపడి విద్యార్థులు ర్యాంకులు సాధించారని గుర్తుచేశారు. విద్యార్థులు చేరడం లేదనే సాకుతో మూసివేయడం కంటే, మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం అందించి, అధ్యాపకులను నియమిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఇప్పటికే పెద్ద ఎత్తున అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతున్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాల విద్యలో 10,159 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేయాలని కోరారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

- పచ్చిరొట్ట సాగుతో భూసారం మెరుగు
- బిందు, తుంపర సేద్యంపై రైతులు దృష్టి సారించాలి
- ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు

కడ్తాల్: ప్రకృతిని పరిరక్షిస్తూ, వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను అవలంభిస్తూ.. అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ అనిత, డాక్టర్ సుప్రజ, డాక్టర్ శిరీష, డాక్టర్ బాలునాయక్ అన్నారు. వ్యవసాయ శాఖ, విశ్వవిద్యాలయ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ముద్విన్, వాసదేవ్ పూర్ గ్రామాల్లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రసాయన ఎరువులు వాడటం వలన భూమి ఫలదాయకత తగ్గిపోతుందని, భూములు నిస్సారమై బీడు భూములుగా మారే ప్రమాదముందని తెలిపారు. అలాంటి పరిస్థితులను అధిగమించేందుకు వర్మి కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు వాడటం ఉత్తమమని, జీలుగ, జనుము కలియదున్నడం ద్వారా భూసార పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. నీటీ ఎద్దడి పెరుగుతుండటంతో బిందు, తుంపర సేద్యంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఎరువులు, విత్తనాల కొనుగోలు అనంతరం రసీదులు తీసుకోవాలని, పంట చేతికి వచ్చే వరకు వాటిని భద్రపర్చుకోవాలన్నారు. తద్వారా ఆపత్కాలంలో సరైన నష్ట పరిహారం పొందవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సాగులోని మెలకువలు, నీటి యాజమాన్యం, భూసారం పెంపు, రసాయన ఎరువుల వాడకం, సాగు ఖర్చులు తగ్గించడం, పంట మార్పిడి, పర్యావరణ రక్షణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. వెటర్నరీ వైద్యశాలలో లభిస్తున్న పలు స్కీంల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓలు అభినవ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కశ్యప్, అనూష, వర్షిత్ ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త విద్యాసాగర్

పంటమార్పిడితో ప్రయోజనం

ఆమనగల్లు: నీటి ఎద్దడి నేపథ్యంలో బిందు, తుంపర సేద్యం ద్వారా నీటిని ఆదా చేయవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ సుచరితాదేవి, డాక్టర్ నిర్మల, స్వప్నశ్రీ, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్‌లు అన్నారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. రసాయన ఎరువుల కారణంగా భూ సారం తగ్గిపోతుందన్నారు. జీవామృతం, వర్మి కంపోస్ట్, నీమ్ కేక్ వాడటం ద్వారా భూసారాన్ని పెంచవచ్చని సూచించారు. అంతరపంటలు, పంటమార్పిడి పద్ధతులతో మట్టి ఆరోగ్యం మెరుగవుతుందని, ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ కేదార్, పలువురు రైతులు పాల్గొన్నారు.



మంగళపల్లిలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడు?

శంకర్‌పల్లి: పట్టణం నడిబొడ్డున ఉదయం పూట వందలాది మంది కూలీలు రోడ్డుపైకి వచ్చి నిలబడుతున్నారు. దీంతో రహదారి సగం మేర రాకపోకలు సాగించలేకుండా నిండిపోతోంది. ఫలితంగా శంకర్‌పల్లిలో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. పాఠశాలలు, కళాశాలలు ఉన్న రోజుల్లో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంటుంది. ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పోలీసులు, అధికారులు పరిష్కారం చూపడం లేదు. ఫలితంగా వివిధ పనుల నిమిత్తం ఉదయాన్నే రోడ్లపైకి వెళ్తున్న వారికి ఇబ్బంది తప్పడం లేదు. ఇప్పటికైనా పోలీసులు ఈ అంశంపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.



చౌరస్తాలో నిలబడిన కూలీలు

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- కేశంపేట ఎంపీడీఓ కిష్టయ్య
- పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



పాపిరెడ్డిగూడలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కేశంపేట: ఇందిరమ్మ ఇళ్లను నాణ్యంగా నిర్మించుకోవాలని ఎంపీడీఓ కిష్టయ్య లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని నిర్దవెళ్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, గ్రామస్తులతో కలిసి శుక్రవారం ఆయన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. కొండారెడ్డిపల్లిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, పాపిరెడ్డిగూడలో మాజీ సర్పంచ్ శివయ్య, బోధునంపల్లిలో మాజీ ఉప సర్పంచ్ నీల పాండు ఇందిరమ్మ నిర్మాణాలను ప్రారంభించారు. నిర్దవెళ్లిలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని తెలిపారు. విడతల వారీగా ఇళ్ల బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమవుతాయని స్పష్టంచేశారు. మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మొద్దని సూచించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నాయకులు గుండే రాణి, అబ్బి సుందరయ్య, చెవెళ్ల నర్సింలు, తాండ్ర కృష్ణారెడ్డి, సత్యంగౌడ్, ప్రభాకర్‌జీ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.